# మాతృధర్మం

కత్తెర గాయకుడు ఏటి పొలాలకు ఎగిరాడు. నువ్వుచేలు వెన్నెల్లా పూసి వెండిగంటలు మోగిస్తున్నాయి. ఆ పువ్వులమీద సీతాకోకను వెంటాడాడు గాయకుడు. స్త్రీ చంచల నేత్రాలతో దృష్టులు సీతాకోక ఎగురులు! కాని కత్తెర గాయకుని ఎగురులు కవి మనస్సులో ఊహాంచలాలు.

వేటకాణ్ణి తప్పించుకోవడంలో సీతాకోక బహు చమత్కారి. నెత్తిమీది కెగిరింది. తోకమీద వాలబోయింది? నిర్భయంగా బయల్లోకెళ్ళి పక్కపొలంలోకి ఏటవాలుగా కత్తెర ముక్కుమీంచి తలవెంట్రుకవాసిలో చేల్లోకిదిగి ఆకుల్లో అదృశ్యమైపోయింది. ప్రాణాలమీదకొచ్చినా సీతాకోక "మొరాలు" చెక్కుచెదరదు. దానిదగ్గర సిక్కు సిపాయిలు సిగ్గుపడాలి. మెరుపుతీగెకన్నా కదలికగల అవయవాల్తో కత్తెరదొర సీతాకోకకోసం పొలమంతా పల్టీలుకొట్టి పరాభవం పొందేడు. మానవ నేత్రాలకల్లా రమణీయమైన చలన చిత్రం నువ్వుచేలపై మందమారుతంలో కత్తెర గాయకుని సీతాకోక వేట.

గాయకుడు ఈమాటు కందికొమ్మ ఎక్కి మాటువేశాడు. నువ్వుపువ్వులో తొండాం పెట్టి మధుపానం చేస్తూ మత్తెక్కిన నెమలి రెక్కల దీపపు పురుగుని ఎగిరి కటక్కున అందుకొన్నాడు. సపోటాలాంటి దాని మాంస ఖండాన్ని దిగమింగాడు. ఇంద్రధనస్సుల్లాంటి పురుగు రెక్కలు గాల్లో ఎగిరిపోయాయి వాటినిచూస్తూ కందికొమ్మమీంచి గానాబజానా మొదలెట్టేడు.

నువ్వుచేల్లో పెంకు పురుగులు, లక్షిందేవి పురుగులు, తుమ్మెదలు, అక్కడక్కడ సీతాకోకలు వందలు వేలూ ఎగురుతున్నాయి. ఆకులనిండా చీడా, గొల్లభామలూ, ఆకుతేళ్లూ విధివిరామం లేకుండా ఉన్నాయి. కష్టపడకుండా కత్తెర కడుపునింపుకోడాని కాహారము అక్కడ ఉన్నాది.

కాని పాటయందు, వేటయందు ఆసక్తిపోయి గాయకుడు కొండల్లో కెగిరాడు. అవస్థపడుతూ ఆరులతో ఆడదాన్ని చేరేడు.

కొండల నడుమ వెదుళ్ళ లోవలో ఇక్ష్వాకులనాటి బొర్రలుచిడచిన మామిడితోట ఉన్నాది. దానికింద నిలువెత్తున దట్టంగా పెరిగాయి వాకలూ, బలుసులూ. ఆ మధ్యని గోడల్లోంచి జివ్వులు బలిసిన పాతనుయ్యివుంది. పక్కగా ముసలి ములగ చిగిర్చి గొంగళీలు పట్టింది. దానికి దగ్గర చిక్కగా బలిసిన తుమ్మపలవల్లో దొరసాని గడ్డిహేటులా గూడు నిర్మిం చింది ఆడ కత్తెర. ఆ గూట్లో పిచ్చికవెంట్రుకలు, జిల్లుడుదూదితో వెచ్చగా గుడ్లకి తివాసీ వేస్తోంది.

గాయకునిచూచి ఆమె చీదరించుకొంది. వెంట్రుక లేరడానికి వెళ్ళి పోయింది. వెంబడించాడు గాయకుడు. సొళ్లు కారుస్తూచేరి ఆమె రెక్కలు సరిచేసి తల్లోచీద తీశాడు. మాతృధర్మంముందు పాతివ్రత్యం మూల పడ్డాది. పెనిమిటిని ఒక్కపోటు పొడిచి దూరంగా ఉండమంది. గూటికి ఎగిరిపోయింది. అతను వెంట్రుకలేరి వెంబడించాడు.

పచ్చగా నేల తంగేళ్లు, తెల్లగా అంకుళ్లు గుత్తులు గుత్తులుగా విరగ బూశాయి. వాకల తొలిపూత కాయలు కడుతున్నాది. అంకుడుపూలు వాసనలు వెదజల్లుతున్నాయి. గూడు పూర్తయింది.

అప్పుడు తేనెలు కారుస్తూ ఆడకత్తెర ప్రియుణ్ని పిలిచింది. గొంతుక సవరించుకొని మెడ తిప్పుతూ ముచ్చటగా మాట్లాడింది. ఇద్దరూ ఆహారానికీ, విహారానికీ జంటగా ఎగిరారు. "పిశిపిశి" మని కూడబలు క్కుంటూ, కొమ్మకొమ్మకీ ఎగిరి మామిడిమాను ముడుసుల్లో పురుగుల్నేరు కున్నారు. గజ్జరాకుల్లో గొల్లభామల్ని, గడ్డి పువ్వుల్లో కందిరీగల్నివొంతు కూడుకున్నారు.

అంగడి మాంసంముక్కని తస్కరించుకొని కొండలోయలో కొచ్చింది బొల్లిగెద్ద. దాని కాళ్ళలో మాంసాన్ని పొడుచుకుంటూ వెంట పడ్డాయి కాకులు. ఊసుపోక ఉల్లాసంతో కాకులకి సాయం వెళ్ళాయి కత్తె రలు. గెద్ద నల్లరి పెట్టడాన్కి కాకికన్న కత్తెర నేర్పరి. గెద్ద తోకకిందికి దూరి ఎగురుతూ కత్తుల్లాంటి ముక్కుల్తో కాళ్ళని పొడిచాయి. ఎండ్ర పీత

ల్లాంటి గెద్ద గోళ్ళలో మాంసంముక్క పట్టుతప్పి రేవడి పొలంలో జారి పోయింది.

బాదంపండంత మాంసంముక్కకి పాతిక కాకులు వొంతులు సిద్ధమై దెబ్బలాడుకు తిన్నాయి. కావలిస్తే కాకికి మాంసం కరువా! కాని, గెద్దతో దెబ్బలాడి గెలిచిన వేట. కత్తెరలు చూస్తూ ఆనందంతో పాటలు పాడాయి. వాళ్ళ పాట కొండ కాలవపాట. ఎత్తుపల్లాల్లో, రాళ్ళ ఎగుడు దిగుడుల్లో, కొండకాలవ పాట. బడ్డులాంటి బొల్లిగెద్ద కోసం కత్తెరల నేమి చేయ గలరు?

కులాయం కెగిరింది ఆ డకత్తెర. ఆవేళతోసరి వాళ్ళ జంటవిహారాలు. ఆమె గుడ్లుపెట్టి గూడెక్కింది. నీలిగా పాలపిట్ట ఈకలు, రంగురంగుల కోడి వెంట్రుకలు. తెల్లని పత్తితో కలిపి నేసిన పట్టు కుషనులో తెల్లగా మెరసిపోతూ మూడుగుడ్లు పెట్టింది. వాటిమీద నల్లని కడుపునాని పొదు గుతూ గూడెక్కింది.

సాయంకాలం పడుతోంది. పొలాల్లో గడ్డిగింజ లేరుకుతింటూన్న సేదపిట్టల దండు ఢుర్రని వెళుళ్ళలో కెగిరింది. మైనగోరలు తాటిచెంకుల్లో కెగురుతూ డేగ వచ్చి పడుతూందని "అలారం" గడియారంలా గరిచాయి. డేగ చక్రాయుధంలాగ విసురుకొచ్చి రాచగువ్వని తన్నుకొని కొండమీంచి కొండమీద కెగిరిపోయింది.

తోవంతా నిశ్శబ్దమైపోయింది. పక్షుల కూజితాలు లేవు. చీకట్లు ముంచుకొచ్చాయి. కోవెల ఇంద్రస్తోత్రం చేసింది. పెళపెళ పిడుగులతో కొండల్లా లేచాయి కారుమేఘాలు. తృణావర్తుడు కృష్ణుడిని విసురుకుపోయి నట్టు పెనుగాలొచ్చి, నీలి మేఘాల్ని మోసుకుపోయింది.

ములగకొమ్మ విరుచుకుపడ్డాది. కత్తెరలు ప్రాణార్తితో గూట్లోంచి ఎగిరిపోయాయి. ఒకళ్ళొకరు పిలుచుకొని చీకట్లో వెతుకులాడి పడిపోయిన ములగకొమ్మమీద కల్సుకున్నారు. గుడ్లూ గూడూ ఏమైనాయో. పక్షులన్నీ ముక్కులు ముడుచుకొని నిద్రించాయి. వికటాట్టహాసాలు చేస్తూ ప్రియు రాలితో పులుగు సరసాలాడుతోంది. రావిపర్ణాలని నములుతూ గందర గోళం చేస్తున్నాయి ఋషిపతులు. రాత్రంతా ఏడుస్తోంది తల్లిప్రాణం. గుడ్డేమైందో? గూడేమైందో? రాత్రంతా ఓదార్చాడు గాయకుడు.

తుమ్మ చెట్టుకడ్డంగా పడ్డ ములగకొమ్మకింద వారిగిపోయున్నాది గూడు. తుప్పల్లో చిక్కుకుపోయి ఓ గుడ్డు కొమ్మదెబ్బకి చితికి సొన కారిపోయింది. చీమలు చేరి సొన తాగుతున్నాయి. ప్రాణానికి ప్రాణమైన గుడ్డు తమ ధన్యజీవితాలకి సంవత్సరాంతంలో ప్రకృతి ప్రసాదించిన ప్రేమ ఫలం. పురుగులు పట్టిపోతోంది. రెండు గుడ్లు కనబడనేలేదు. తుప్పలకింద నుంచి బూడిదరంగు జంతువ కనపడ్డాది. నక్కతోకలాంటి బొచ్చుతోక ఆడిస్తూ పందికొక్కు మూతిని సందులలో పెడుతున్నాది ముంగిస. దాన్ని చూసి ఆకులలోంచి గజగజలాడుతూ పారిపోయింది తొండ. గూనివాడిలాగ నీటికోడి తుప్పలోకి పలాయనమైపోయింది. ముంగిస చితికిన కత్తెరల గుడ్డునందుకొని పాలముంజిలాగ తింటోంది.

కత్తెరలు రెండూ ఉక్కు కత్తెరల్లా పోరాడాయి. ముంగిస పాములా బుసకొట్టి అందుకుంది రెక్క. దాని నోటికి కత్తెర గాయకుడు దొరికి పోయాడు. ముంగిసకి రోజు అదృష్టంతో తెల్లారింది. గుడ్డుకి పోతే పుంజు లభ్యమయింది. పాముల్ని తింటూ మొహం మొత్తిన ముంగిసకి పక్షి మాంసం ప్రాప్తించింది. ఆడకత్తెర వెర్రెత్తిపోయింది. మొండిధైర్యంతో ముంగి మూతిని తన్నింది. ముంగి లక్ష్యపెట్టకుండా పుంజుతల కోరలతో నొక్కింది. దాని దౌంష్ట్రిల్లో ప్రాణాలు విడుస్తూ కత్తెర గాయకుడు ఆఖరు సారిగా కీచుమన్నాడు. పిట్టలతో పిలపిల్లాడుతున్న కొండలోవ హృదయంలోకి అతని కేక బాకులా దూసుకుపోయింది. ముంగి తొందరగా పరిగెత్తి పుట్టలో దూరిపోయింది.

చీమలు పెట్టినపుట్ట. బాబాక్రమంతో పాము పరిగ్రహించిన పాతాళ భవనం. దాన్ని చంపి స్వాధీనపరచుకొన్న ముంగిస మట్టికోట. పుంజు కత్తెర అస్తికలకి గోరీ అయింది.

ఏకాకియై ఆడకత్తెర నిలువెత్తు మట్టిగోరీకి ప్రదక్షిణాలు చేస్తూ విలపించింది. దాని విలాపం గ్రహించలేక బ్రహ్మానందంగా వుందని గీతం రాసుకున్నాడు, కవిబ్రహ్మ ననుకుంటూ మానవుడు.

విచారభారంతో కుంగిపోయినా కత్తెర గూడుని మళ్ళా సరిచేసింది. మరో గుడ్డుని పెట్టి గూడెక్కి కళ్ళురమోడ్చి పొదుగుతూ దురదృష్టాన్ని మరచిపోయింది. మాతృధర్మం ముందు ప్రియుని వియోగం ఏ మాత్రం?

గుడ్డుపగిలి జీవం బయటపడ్డాది. ఎండల తీక్షణత అధికమయింది. వెంట్రుకల్లేని ఆ గుడ్డిమాంసంముద్దకి ఎండ తగలకుండా రోజంతా తన రెక్కలతో నల్లగొడుగులు పట్టింది. సంధ్యా సమయాల్లో పిల్లకి మేత పెట్టి తానో నాలుగు పురుగుల్నేరుకొనేది.

ఏముంది? రెక్కలొస్తే పిల్ల ఎగిరిపోతుంది. ఏకాకి అయిపోతుంది. మళ్లా వసంతకాలం వస్తుంది.

కత్తెర పిల్లకి రెక్కలొచ్చాయి. కనుక్కొని అపురూపంగా పెంచిన పిల్ల పుంజుపిల్ల అయింది.

కాలం తిరగ బడ్డాది. అడవి మల్లెల పసికొచ్చి గండు తుమ్మెదలు పువ్వుపువ్వుకూ వెళ్తున్నాయి. పాలతీగ కాయలు పేలి గాలినిండా దూది గుమ్మటాలకింద గింజలెగురు తున్నాయి. టేకుచెట్లని చిగిరించి పచ్చబావుటా ఎత్తి మౌనశంఖము పూరించాడు వసంతుడు.

ఆడకత్తెర పిల్లపుంజుతో పొలంలోకెళ్ళి హల్వాలాంటి ఆకుపురుగుల్ని, వేడివేడి పెంకుపురుగుల్ని ఏరుకు తింటున్నాది. పిల్లపుంజు కంఠమెత్తి పాడింది. దాని కంఠంలో సౌందర్యం తొణికిసలాడింది. ఆడకత్తెర తన మాతృధర్మాన్ని నిర్వర్తించి కృతకృత్యురాలయింది. హృదయం ద్రవీభూతమైంది.